ఎర్ర జొన్న...రైతుకు ఆదాయం మిన్న

- ఎర్రజొన్న సాగుపై మక్కువ చూపుతున్న రైతులు
- పెట్టుబడులు తక్కువ... దిగుబడులు ఎక్కువ
- ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతుల ముందడుగు



పరిటాల సమీపంలో సాగవుతున్న ఎర్రజొన్న

నందిగామ: ఈ ఏడాదిని ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇతోధికంగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో కొందరు రైతులు చిరుధాన్యాల సాగును ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా నందిగామ ప్రాంతంలో చిరుధాన్యాల కోవకు చెందిన ఎర్ర జొన్న సాగును రైతులు ప్రారంభించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు వస్తుండడానికి తోడు వీటి ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో ఎర్ర జొన్న సాగు చేస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

462 ఎకరాల్లో ఎర్రజొన్న సాగు

ఎన్టీఆర్ జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది రబీ సాగుగా పచ్చ, తెల్ల, ఎర్ర జొన్న పంటలు మొత్తం 1140 ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. దానిలో ఎర్ర జొన్న 462 ఎకరాలలో సాగుతోంది. అది కూడా కంచికచర్ల మండలం పరిటాల ప్రాంతంలో అత్యధికంగా 456 ఎకరాలలో ఎర్ర జొన్న పంటను రైతులు సాగు చేస్తున్నారు.

నీటి తడులు పెద్దగా అవసరం లేని సాగు

ఎర్ర జొన్న సాగుకు నీటి తడులు పెద్దగా అవసరం లేదు. పైరు జీవితకాలం విత్తనం నాటిన దగ్గర నుంచి 110 రోజులు ఉంటుంది. అవసరాన్ని బట్టి అధిక దిగుబడి కోసం రెండు లేక మూడు సార్లు నీటి తడి అందిస్తే సరిపోతుంది. ముఖ్యంగా ఈ ఎర్ర జొన్న సాగు ఎటువంటి నేలలో నైనా చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు

ఎర్ర జొన్న సాగు చేసేందుకు ఎకరాకు రూ.12 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఈ మొక్కకు తెగుళ్లు కూడా పెద్దగా వ్యాపించవు. దీనికి తోడు దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయి. నీటి తడి బాగా అందించిన పొలాల్లో ఎకరాకు దాదాపు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. నీటి తడులు అందించలేని పొలాల్లో 22 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఎర్ర జొన్నలు క్వింటా రూ.2,500 వరకు ధర పలుకుతున్నాయి. ముఖ్యంగా ఈ జొన్నలను ఇటీవల బిస్కెట్లలో వినియోగించేందుకు కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

జొన్న పంటలోని రకాలు

జొన్నలో మొత్తం మూడు రకాలు ఉన్నాయి. పచ్చ జొన్న మొక్క సుమారు తొమ్మిది అడుగుల పైన ఎత్తు పెరుగుతుంది. ఈ కారణంగా పైరగాలికి మొక్కలు విరిగిపోయే ప్రమాదం ఉంది. దిగుబడి కూడా తక్కువగా వస్తుంది. తెల్లజొన్న దిగుబడి అధికంగా వచ్చినా ధర ఆశాజనకంగా ఉండదు. ఎర్ర జొన్న మొక్క కేవలం ఐదు అడుగుల ఎత్తు వరకే ఎదగటం వలన గాలికి మొక్కలు దెబ్బతినవు. దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. దీనికి తోడు ఇటీవల బిస్కెట్ల తయారీలో మైదాపిండికి బదులు ప్రజల ఆరోగ్యానికి మేలు చేసే ఎర్ర జొన్న పిండిని వినియోగిస్తుండటంతో వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సాధారణ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండడంతో రైతులు ఎర్ర జొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

ప్రభుత్వం చిరుధాన్యాలు పండించే రైతులను ప్రోత్సహిస్తోంది. ముఖ్యంగా జొన్న, రాగి, వరిగ, సజ్జ, కొర్ర, సామ, ఊద, అరిక లాంటి ఎనిమిది రకాల చిరుధాన్యాల పంటలను సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహిస్తోంది. ముఖ్యంగా మన ప్రాంతంలో జొన్న సాగు అనువుగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రతి హెక్టారుకు రూ.6 వేల చొప్పున సాయమందిస్తోంది. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రూ.1,50 లక్షల రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్‌లను కూడా ఏర్పాటు చేస్తోంది. రైతులకు ఉచిత పంట బీమాతో పాటు అవసరమైతే బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కూడా కల్పిస్తోంది. ముఖ్యంగా కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2500 గా నిర్ధారించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఈ తరహా పంటలపై రైతులు కూడా ఆసక్తి చూపుతున్నారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



పంట సాగు చేసే రైతులకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర దక్కేలా చూస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ ఏడాది రైతులు రబీ పంటగా కంచికచర్ల మండలంలో ఎర్ర జొన్న సాగు చేస్తున్నారు. ఆ పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

–రమణమూర్తి, ఏడీఏ, నందిగామ

ఎర్రజొన్న సాగు ఆశాజనకంగా ఉంది



నేను గత రెండేళ్లుగా ఎర్ర జొన్న పంటను 18 ఎకరాల్లో సాగు చేస్తున్నాను. నీటి తడులు ప్రత్యేకంగా అవసరం లేకుండా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తున్నాయి. ప్రభుత్వం కూడా ఈ తరహా పంటలను ప్రోత్సహిస్తోంది. గిట్టుబాటు ధర కూడా బాగానే ఉంది. అందువలన ఈ ఏడాది కూడా ఎర్రజొన్న సాగు చేస్తున్నా.

–బత్తుల శేషయ్య. ఎర్ర జొన్న సాగు రైతు, పరిటాల

సీఎస్ఐ చర్చిలో కోత పండుగ



కృష్ణా, గోదావరి డయాసిస్ ట్రెజరర్ అలెగ్జాండర్‌ను సన్మానిస్తున్న చర్చి ప్యారిస్ కమిటీ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చిలో ఆదివారం కోత పండుగ (కృతజ్ఞతార్పణల పండుగ) ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చర్చిలో జరిగిన ఆరాధనలో కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండం డయాసిస్ ట్రెజరర్ సదర్ల అలెగ్జాండర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేవుడు తన బిడ్డలకు ఇచ్చిన సంపాదనలో దశమ భాగం దేవునికి అప్పగించాలని బైబిల్ చెబుతోందన్నారు. చర్చి ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాల్స్ వద్ద సంఘస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గృహ వినియోగ వస్తువులను కొనుగోలు చేశారు. డ్రాలు తీసి బహుమతులు అందజేశారు. ప్యాస్ కమిటీ సభ్యులు అతిథిని సన్మానించారు. ప్యారిస్ డీనరీ చైర్మన్ డాక్టర్ డి.రాజు, చర్చి ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాకలపాటి కనకరాజు, ఎంఏపీ జోసఫ్, చర్చి కమిటీ సభ్యులు ఇమ్మానుయేల్, దేవరాజు, కె.ప్రభాకర్ ప్రభుజీ, కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా సమావేశం



కంచికచర్లలో ఎస్టీయూ జిల్లా స్థాయి సమావేశంలో జెండాను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

కంచికచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్రోపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య అధ్యక్షతన 76వ ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులకు ప్రతినెలా 1వ తేదీలోగా జీతాలు ఇవ్వాలని, పెండింగ్ బకాయిలను ఇవ్వాలని, అనవసరమైన యాప్‌లను రద్దు చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, డీఏ బకాయిలు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనుగ్రహప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణ్‌కిషోర్, రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ కొమ్ము ప్రసాద్, చంద్రశేఖర్, సంఘ నాయకులు కోటేశ్వరరావు, శేషం గోపాలరావు, ఇస్మాయేలు, నంద్రు సురేష్, బుచ్చిబాబు, విక్టర్ బాబు, వెంకట్రావు, మేకల సుధాకర్, అంజిరెడ్డి, బళ్లా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



శివగంగ కాలనీలో నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే హెడ్ వాటర్ వర్క్స్‌లో పనిచేసే మోటార్ మరమ్మతులకు గురవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణ శివారు ప్రాంతాలైన 1, 6 వార్డులకు చెందిన శివగంగ కాలనీ, యానాదుల కాలనీ, తదితర పలు ప్రాంతాలలోని ప్రజలకు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు అందజేస్తున్న నీటి సరఫరాను మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ హెడ్ వాటర్‌వర్క్స్‌లో మరమ్మతులకు గురైన మోటారును విజయవాడలో రిపేరు చేస్తున్నందున మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాల మేరకు ట్యాంకర్ల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



నిత్యావసరాలు అందజేస్తున్న విమలాభాను, వైఎస్సార్ సీపీ నేతలు

పెనుగంచిప్రోలు: సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తి నిస్తాయని విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను అన్నారు. గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయం పక్కన జనవరి 26 అర్ధరాత్రి తర్వాత జరిగిన అగ్ని ప్రమాదంలో 19 దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులకు ఆదివారం గ్రామస్తులు కొరివి కృష్ణ, అనసూర్య దంపతులు అందించిన బియ్యం సంచులు, నిత్యావసర సరుకుల పంపిణీలో విమలాభాను పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బాధితులకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తక్షణ సాయం అందించారన్నారు. మరింత సాయం అందించడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, పూసల, మైనింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు చేని కుమారి, బత్తుల రామారావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ చుంచు బెనర్జి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, యనమదల నాగు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలి

కీసర(కంచికచర్ల): భవన నిర్మాణ రంగ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా యూనియన్ అధ్యక్షుడు జి.హరికృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కీసర ఆంజనేయస్వామి కల్యాణమండలంలో గండేపల్లి, కీసర, వేములపల్లి, పెండ్యాల గ్రామాల భవన నిర్మాణ రంగ కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల భద్రత కోసం 1996 కేంద్ర చట్టాన్ని అనుసరించి సంక్షేమ బోర్డుకు కేటాయించిన నిధులను కార్మికుల కోసం ఖర్చు చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడుగా పల్లె రాయప్ప, ప్రధాన కార్యదర్శిగా కోయా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కాకుమాను రామారావు, ఆవుదొడ్డి బాబు, సహాయ కార్యదర్శులుగా జీనేపల్లి స్వామి, పసుపులేటి రాజేష్, కోశాధికారిగా నాగులపాటి శేషాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ మీర్జావలి, జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల కుమార్, పిల్లా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిటాలలో ఉచిత వైద్య శిబిరం



పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల గ్రామ సచివాలయం–1లో విజయవాడ ఎంజే నాయుడు, ఐయాన్ ఆసుపత్రి బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆసుపత్రి చైర్మన్ వావిలాల రాజేంద్రశర్మ ఆదివారం తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, సుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, ఎముకలు, కీళ్లకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేశామని, 190 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు రవితేజ, వంశీకిరణ్, బషీర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

• పుస్తకాల పండుగ









విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 33వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా సుప్రసిద్ధ కవి ముదివర్తి కొండమాచార్యుల శతజయంతి సభ ఆదివారం రాత్రి గొల్లపూడి మారుతీరావు సాహితీ వేదికపై జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరై కొండమాచార్యులకు నివాళులర్పించారు. అనంతరం పుస్తక ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్



మధురానగర్(విజయవాడ సెంట్రల్): షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అయోధ్యనగర్‌కు చెందిన కరేటి రమేష్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన సొసైటీ ఎన్నికలలో రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని రమేష్ పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 32వ డివిజన్‌కు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్‌ను అభినందించారు.

క్లుప్తంగా

వాసవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



నందిగామ: మాఘమాసం నేపథ్యంలో పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, శ్రీ చక్రమునకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. వేద పండితుడు రాజోలు భాను శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

కంచికచర్ల: ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరుగుతుందని తహసీల్దార్ పద్దేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటామని, వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

కారు పల్టీ : ఇరువురికి స్వల్ప గాయాలు



నందిగామ: అదుపుతప్పి కారు పల్టీ కొట్టిన ఘటన జాతీయ రహదారిపై నందిగామ మండలం ఐతవరం సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం 65వ నంబర్ జాతీయ రహదారిపై విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు నందిగామ మండలం ఐతవరం సమీపంలోకి రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు తోలుతున్న మహిళతో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం సహించం



ఆటో చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌హెచ్‌ఓ సతీష్

నందిగామ: ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని ఎస్‌హెచ్‌ఓ సతీష్ హెచ్చరించారు. స్థానిక రామన్నపేట రోడ్డులో ఆదివారం సాయంత్రం ఆటో డ్రైవర్లకు ఆయన ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోవాలాలు నిబంధనల ప్రకారమే ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం తాగి ఆటోలు నడిపి ప్రమాదానికి కారణమైతే ఉపేక్షించేది లేదన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం, పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలైన హరీష్

కంచికచర్ల: రెండు బైకులు ఎదురుగా వస్తూ ఢీకొనగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం కంచికచర్లకు చెందిన గర్నెపూడి హరీష్ అనే వ్యక్తి బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ఘటనలో హరీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని వైద్య చికిత్స కోసం విజయవాడ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

అల్లూరు(వీరులపాడు): వాహనదారులు నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ సోమేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని అల్లూరు గ్రామ శివారులో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు నిబంధనల మేరకు వాహనాలు నడపాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఆటోవాలాలు పరిమితి మేరకు ప్రయాణికులను ఎక్కించాలన్నారు.

30 మంది వాహనదారులకు జరిమానా

కంచికచర్ల: ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలో 30 మంది వాహనదారులకు ఆదివారం ఆయన రూ.3,600 జరిమానా విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణం చేయరాదన్నారు. వేగంగా వాహనాలు నడపరాదని డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు సంబంధిత పత్రాలు కలిగి ఉండాలన్నారు.

16న ఉరుసు మహోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: హజ్రత్ దావూద్ షా అవులియా వారి ఉరుసు మహోత్సవం ఈనెల 16 వ తేదీన స్థానిక బలుసుపాడు రోడ్డులోని దర్గా వద్ద జరుగుతుందని దర్గా అభివృద్ధి కమిటీ చైర్మన్ షేక్ ఖాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 వ తేదీన గంధం, 17న దీపాలంకరణ(చిరాగ్) జరుగుతుందని పేర్కొన్నారు.

కూచిపూడి నృత్యంలో శ్రుతి సమన్వి ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం కల్చరల్, డిఫెన్స్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వందేభారతం నృత్య ఉత్సవ్–2023లో నగరానికి చెందిన కె.శ్రుతి సమన్వి సత్తా చాటింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో ఏడాది చదువుతున్న శ్రుతి జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కూచిపూడి నృత్యం విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, ఇతర అధ్యాపకులు శ్రుతి సమన్వికి అభినందనలు తెలిపారు.

శిక్షణ కేంద్రం సీఈకి ఉద్యోగుల సత్కారం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లోని ఏపీ జెన్‌కో శిక్షణా కేంద్రం చీఫ్ ఇంజినీర్‌గా ఇటీవల కాలంలో బాధ్యతలు స్వీకరించిన నాగభూషణంకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ కిరణ్ మాట్లాడుతూ దేశ స్థాయిలో పేరెన్నికగల శిక్షణ సంస్థ కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు, అధికారుల సహకారంతో సంస్థ పురోభివృద్ధికి కృషిచేస్తానని సీఈ తెలిపారు.

హిందీ పరీక్షలకు 156 మంది హాజరు

తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో తిరువూరు సర్వోదయ స్కూలులో ఆదివారం నిర్వహించిన హిందీ పరీక్షలకు 156 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర, ప్రవేశిక పరీక్షలు నిర్వహించినట్లు పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ రమణమూర్తి తెలిపారు. పరీక్షలను హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ పర్యవేక్షించారు.

రూ.2 లక్షల విరాళం

గోసవీడు(గంపలగూడెం): గోసవీడు శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయ గోపుర పునర్నిర్మాణానికి దాతలు ఆదివారం రూ.2 లక్షలు విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన దివంగత నేరెళ్ల సుబ్బయ్య, రత్తమ్మల జ్ఞాపకార్థం కుమారులు నేరెళ్ల నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, రోశయ్య, బాబు ఈ మొత్తాన్ని కమిటీ సభ్యులు నేరెళ్ల సతీష్, సుభాష్‌లకు అందజేశారు.